
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం | 4 | నవంబర్ | 2023



బ్రహ్మోత్సవం.. నయనమనోహరం


వాడపల్లి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నయనమనోహరంగా జరుగుతున్నాయి. 10లో▸



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి శుక్రవారం గోదావరి తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కార్తికం.. ఏర్పాట్లు విస్తృతం



రానున్న కార్తిక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని సన్నిధిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అన్నవరం దేవస్థానం, ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం నిర్ణయించింది. 10లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.45 లక్షలు

రాజమహేంద్రవరం సిటీ: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని డిపోల నుంచి ఉభయ రాష్ట్రాలలో పలు ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.45.42 లక్షలు ఆదాయం సాధించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారిణి షర్మిల అశోక తెలిపారు. రాజమహేంద్రవరం,కొవ్వూరు.గోకవరం, నిడదవోలు డిపోల నుంచి 187 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. తద్వారా ఈ ఆదాయం సాధించినట్లు పేర్కొన్నారు. గత నెల 18 నుంచి 29 వరకూ 98048 కిలో మీటర్లు ప్రయాణించి 14,000 మంది ప్రయాణికులను ప్రత్యేక బస్సుల ద్వారా గమ్య స్థానాలకు చేరవేశామన్నారు. దసరా సెలవులు ప్రకటించడంతో తెలంగాణా నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్ నుంచి జిల్లాకు 30 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. విజయవాడకు 60బస్సులు, విశాఖపట్నం 90 బస్సులు ఇతర ప్రాంతాలకు ఏడు బస్సులు నడిపినట్లు ఆమె వివరించారు. విజయవాడకు రాజమహేంద్రవరం డిపో 16,కొవ్వూరు-20, గోకవరం డిపో 25, నిడదవోలు డిపో 20 బస్సులు నడపగా రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నానికి 90 ప్రత్యేక బస్సులు నడిపినట్లు షర్మిల అశోక తెలిపారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో శనివారం పలు విలేజ్‌హెల్త్‌క్లినిక్, యుపీహెచ్‌సీలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సగ్గొండ(గోపాలపురం), కడియపుసావరం -1(కడియం), బొమ్మూరు-2(రాజమహేంద్రవరం రూరల్),పల్లకడియం (రాజానగరం), రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో ఆనందనగర్, సారంగధరమెట్ట యూపీహెచ్‌సీలలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శివసదన్ సత్రంలో విద్యుదీకరణ పనులు

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని శివసదన్ సత్రంలో రూ.3.23 కోట్ల వ్యయంతో విద్యుత్ ప్యానల్ బోర్డు ఏర్పాటు, కేబుల్స్, సింకనైజింగ్ సిస్టమ్ పనులకు దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రకాష్ సదన్ సత్రంలోని ధర్మకర్తల మండలి సమావేశపు హాలులో ఛైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. శివసదన్‌లో గతంలో రూ.2.50 కోట్ల వ్యయంతో విద్యుత్ సంబంధ పనుల టెండర్లకు ఆమోదం తెలిపింది. సుమారు రూ.73 లక్షలు అదనంగా పెరగడంతో సవరణ అంచనాలతో రూ.3.23 కోట్లకు ఆమోదించింది. ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. 67 అంశాలకు రూ.3 కోట్లకు సంబంధించిన 50 కి పైగా వివిధ నిర్మాణాల టెండర్లు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

సత్యదేవుని రూ.800 వ్రతం టిక్కెట్ ధర పెంపు

అన్నవరం: అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.800 వ్రతం టిక్కెట్‌ను రూ.1000కి పెంచుతూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దేవస్థానంలో రూ.300, రూ.800, రూ.1,500, రూ.2 వేలు టిక్కెట్లపై వ్రతాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. రూ.300, రూ.1,500, రూ.2 వేల వ్రతం టిక్కెట్ల ధరలను యథాతథంగా ఉంచారు. పెంపు ఈ నెల 14 నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ నాయకులకు నోటీసులు

కాకినాడ క్రైం: 2021లో కాకినాడ పోర్టులోకి అక్రమంగా చొరబడిన తెలుగుదేశం పార్టీ నాయకులకు శుక్రవారం పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. ఆ పార్టీ నాయకులు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వర రావు, జ్యోతుల నవీన్, రామకృష్ణారెడ్డి కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నోటీసులు అందుకున్నారు. చొరబాటుకు యత్నించిన తొమ్మిది మందిలో ఐదుగురికి నోటీసులు ఇవ్వాల్సి ఉందని పోర్టు పీఎస్ సీఐ సుమంత్ తెలిపారు.

బడుగుల ముంగిట విద్యుత్ వెలుగులు

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచితంగా సరఫరా
- 200 యూనిట్ల వరకూ వినియోగించే వారికి మేలు
- ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,81,193 మందికి లబ్ధి
- ప్రతి నెలా రూ.7.86 కోట్లు భరిస్తున్న ప్రభుత్వం
- ఎన్నికల హామీల్లో భాగంగా అమలు



నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెంలో ఉచిత విద్యుత్ పొందుతున్న కాలనీ

సాక్షి, రాజమహేంద్రవరం: బడుగుల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును విస్తృతం చేస్తోంది. వారి ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలుస్తోంది. అంతటితో ఆగకుండా వారిపై విద్యుత్ భారం కూడా పడకుండా కూడా చర్యలు తీసుకుంటోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి ఇళ్లకు ఉచిత విద్యుత్ అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. నెలకు 200 యూనిట్ల వరకూ విద్యుత్ వినియోగించే వారిపై బిల్లుల భారం పడకుండా ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఆయా వర్గాల నుంచి నయాపైసా వసూలు చేయకుండా విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్) నేరుగా చెల్లిస్తోంది. ఈ నిర్ణయంతో తమకు ఎంతో ఉపశమనం కలుగుతోందని ఆ వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా బిల్లుల చెల్లింపునకు ఎదురు చూడాల్సిన పరిస్థితి తప్పిందని చెబుతున్నారు.

ఎన్నికల హామీ కార్యరూపం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ఇళ్లకు ప్రతి నెలా 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందించేవారు. అది కూడా అరకొరగానే అమలయ్యేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందజేస్తామని నాడు ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీకి కార్యరూపం ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా డిస్కమ్‌లకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,81,193 మందికి లబ్ధి

ఈ పథకం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,81,193 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. వీటిలో ఎస్సీ కుటుంబాలు 1,30,392, ఎస్టీ కుటుంబాలు 50,801 ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ క్రమం తప్పకుండా ఈ కుటుంబాలకు నిరంతర విద్యుత్ వెలుగులు అందిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారు. విద్యుత్ రాయితీ అందకపోతే గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదిస్తే పరిష్కారం చూపుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన అరకొర విద్యుత్ సబ్సిడీతో పోల్చుకుంటే ప్రస్తుతం మూడు రెట్లు అదనపు ప్రయోజనం కలుగుతోందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

డిస్కమ్‌కు నాలుగేళ్లుగా రూ.377.28 కోట్లు చెల్లింపు

ఉమ్మడి జిల్లాలో ఇళ్లకు ప్రస్తుత టారిఫ్ ప్రకారం 30 యూనిట్ల వరకూ యూనిట్‌కు రూ.1.90, 31 నుంచి 75 యూనిట్ల వరకూ రూ.3.76, 125 యూనిట్ల వరకూ రూ.4.50, 126 నుంచి 225 యూనిట్ల వరకూ రూ.6 చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,81,193 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ప్రతి నెలా 1,53,05,397 యూనిట్ల వరకూ విద్యుత్ వినియోగిస్తున్నాయి. దీనికి గాను ప్రతి నెలా రూ.7.86 కోట్ల మేర బిల్లులు వస్తున్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఈపీడీసీఎల్)కు చెల్లిస్తోంది. ప్రతి నెలా అంత పెద్ద మొత్తంలో భారం పడుతున్నప్పటికీ బడుగుల సంక్షేమం కోసం ఏమాత్రం వెనకడుగు వేయకుండా నాలుగేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బిల్లులు రూ.377.28 కోట్ల మేర ఏపీ ఈపీడీసీఎల్‌కు చెల్లించింది.

జిల్లా	ఎస్సీ (విద్యుత్ సర్వీసులు)	ప్రభుత్వం చెల్లించే మొత్తం (రూ.లక్షల్లో)	ఎస్టీ (విద్యుత్ సర్వీసులు)	ప్రభుత్వం చెల్లించే మొత్తం (రూ.లక్షల్లో)
తూర్పు గోదావరి	19,564	105.33	1,003	4.68
కోనసీమ	66,611	327.61	1,596	7.90
కాకినాడ	40,263	195.52	3,371	11.26
అల్లూరి సీతారామరాజు	3,954	15.99	44,831	118.01

బిల్లుల ఆందోళన తప్పింది



ప్రతి నెలా రూ.300 వరకూ కరెంటు బిల్లు కట్టాల్సి వచ్చేది. రోజువారీ కూలి చేసుకుంటూ జీవించే మాకు ఈ బిల్లు భారంగా ఉండేది. ప్రతి నెలా డబ్బులు తీసి పక్కకు పెట్టాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. 200 యూనిట్ల వరకూ విద్యుత్ వాడుకుంటున్నాం. నయాపైసా బిల్లు రావడం లేదు. కరెంటు బిల్లు కట్టి ఇప్పటికి నాలుగేళ్లవుతోంది.

– నేమాల లక్ష్మి, కాటకోటేశ్వరం, నిడదవోలు రూరల్


ప్రభుత్వం అండగా నిలిచింది



ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేసి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గతంలో ప్రతి నెలా బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడేవాళ్లం. బిల్లులు చెల్లించే కష్టాల నుంచి మమ్మల్ని ప్రభుత్వం రక్షించింది. 200 యూనిట్ల వినియోగం గృహ అవసరాలకు సరిపోతోంది. గతంలో ఇళ్లకు ఇంతలా ఉచిత విద్యుత్ ఇవ్వలేదు. బిల్లుల సొమ్మును కుటుంబ ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నాం.

– ముప్పిడి మంగ, సమిశ్రగూడెం, నిడదవోలు రూరల్

సద్వినియోగం చేసుకోవాలి



ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తించేలా చూస్తున్నాం. ఇంకా ఎవరైనా అర్హత ఉండి, లబ్ధి పొందాలనుకుంటే కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. సంబంధిత మండల ఏఈకి దరఖాస్తు చేస్తే పూర్తి విచారణ జరిపి, అర్హులైతే ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. వాటికి బిల్లు వచ్చినా వారు నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదు.

– టీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం

హరిత నగరంగా రాజమహేంద్రవరం

- ఎంపీ భరత్‌రామ్ కృషి ప్రశంసనీయం
- క్రికెటర్ అంబటి రాయుడు



మొక్కలు నాటుతున్న క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పచ్చని చెట్లతో హరిత నగరాన్ని తలపిస్తోందని క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత హరిత (గో గ్రీన్ ఛాలెంజ్)లో భాగంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తిలక్ రోడ్‌లో నిర్మించిన డివైడర్లలో ఎంపీ భరత్‌తో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత హరిత చాలా అద్భుతమైన కార్యక్రమమన్నారు. మహాయజ్ఞంలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భరత్‌రామ్‌కు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. భరత్ లాంటి యువకులు రాజకీయాలలోకి వస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో ఆచరణలో చేసి చూపించారన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకువెళ్ళేందుకు యువత ముందుకు రావాలన్నారు. దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నగరంలో ఒకవైపు హరిత విప్లవం, మరోవైపు ఇంటర్నేషనల్ స్టేడియంపై ఎంపీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండటం శుభ పరిణామమన్నారు.

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్లు అభివృద్ధికి అన్ని విధాలా సహకరించడం వల్లే నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దామన్నారు. నగరంలో ఫ్లడ్ లైట్లతో రెండు క్రికెట్ స్టేడియాలు రాబోతున్నాయన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అది ఈ నెలలోనే ప్రారంభోత్సవం కానుందన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కను దత్తత తీసుకుని పరిరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎంపీ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటికి ఆక్సిజన్ ఆధారమన్నారు. ఇందుకోసం మొక్కలు విరివిగా పెంచాలన్నారు. కాలుష్యం నుంచి కాపాడుకోవాలంటే చెట్లు అవసరమన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు,వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి కళాశాల, వికాస్ ఫార్మసీ, ఫ్యూచర్ కిడ్స్, భాష్యం స్కూల్ విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లాలో 1,569 పోలింగ్ కేంద్రాలు

- ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి చర్యలు
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం కలెక్టర్, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హల్ నుంచి కలెక్టర్ మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నియోజక వర్గాల వారీగా సమగ్ర నివేదికను సేకరించామన్నారు. జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలలో 1,569 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నైపుణ్యతతో సహకార సొసైటీలు అభివృద్ధి

డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు



సంఘాల అభివృద్ధిపై మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహకార సొసైటీల అభివృద్ధి,మనుగడ పాలకవర్గ సభ్యులు,సిబ్బంది నైపుణ్యతపైనే ఆధారపడి ఉంటుందని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సహకార కేంద్రబ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. స్థానిక రామదాసు సహకార శిక్షణ సంస్థలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ, డీసీసీబీ(కాకినాడ), హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ కోపరేటివ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిబ్బంది అంకిత భావంతో పాటు నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు. రైతులకు మేలు చేసే విధంగా సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు. సంఘాల మనుగడను దృష్టిలో పెట్టుకొని సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. జిల్లా కోపరేటివ్‌ఆఫీసర్ ఉమామహేశ్వర రావు, డీసీసీబీ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ,శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఆదిమూలం వెంకటేశ్వర రావు, రాజమహేంద్రవరం డివిజన్ సొసైటీల పాలకవర్గసభ్యులు,సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.





క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయ్యప్ప స్వాముల భజనకు సౌండ్ సిస్టమ్ పెడుతుండగా ఘటన


దుర్గా రవికుమార్ మృతదేహం

నిడదవోలు: అయ్యప్ప స్వాముల భజనకు సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నిడదవోలు పట్టణ ఎస్సై పి.నాగరాజు కథనం ప్రకారం.. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయం సమీపాన అయ్యప్ప స్వాముల భజనలు ఏర్పాటు చేశారు. దీనికి పట్టణానికి చెందిన రవి సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడు క్రొవ్విడి దుర్గా రవికుమార్ (35) శుక్రవారం సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాడు. దీని వైర్లను అమర్చుతుండగా అవి కాస్తా 11 కేవీ విద్యుత్ వైర్లకు తగలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో అతడు మృతి చెందాడు. రవికుమార్‌కు భార్య సురేఖ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిడదవోలు చుట్టుపక్కల శుభకార్యాలకు సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి జీవనోపాధి పొందుతున్న దుర్గా రవికుమార్ మృతిని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని మహిళ మృతి

పెద్దాపురం: మతిస్థిమితం లేని మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం పెద్దాపురంలో చోటు చేసుకుంది. స్థానిక దర్గా సెంటర్ నుంచి సినిమా సెంటర్‌కు వెళ్లే రహదారిలో ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన మతిస్థిమితం లేని కె.లక్ష్మి (43) అటుగా వెళ్తూ అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీకం.. ఏర్పాట్లు విస్తృతం

- పర్వదినాల్లో అర్ధరాత్రి ఒంటి గంట నుంచే వ్రతాలు, దర్శనం
- పౌర్ణమి, సత్యదీక్షల విరమణనాడు గిరి ప్రదక్షిణ
- తెప్పోత్సవానికి పంపా నీటిమట్టం 98 అడుగులు ఉండేలా చర్యలు
- కొండ దిగువన, రత్నగిరి, సత్యగిరిపై కేశఖండన శాలలు
- రూ.300 టికెట్టుపై భక్తులకు స్లాట్ పద్ధతిలో దర్శనాలు
- ఏర్పాట్లపై 10న ట్రయల్ రన్
- అన్నవరం దేవస్థానం, ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం నిర్ణయం


సమావేశంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ ఆజాద్, ఇతర అధికారులు

అన్నవరం: రానున్న కార్తిక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని సన్నిధిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని అన్నవరం దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం నిర్ణయించింది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకూ కొనసాగే కార్తిక మాసంలో లక్షలాదిగా భక్తులు రానున్నందున, అందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టనున్నారు. దేవస్థానంలోని స్వామివారి నిత్య కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సమన్వయ సమావేశానికి చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ, కార్తికంలో వచ్చే భక్తుల కోసం కొండ దిగువన టోల్‌గేటు వద్ద ఉన్న కళాశాల మైదానంలో, సత్యగిరి, రత్నగిరిపై పలు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తులకు విశ్రాంతి షెడ్లు, రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం ఎదురుగా 140 అడుగుల వెడల్పు, 175 అడుగుల పొడవున విశ్రాంతి షెడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈసారి రామాలయం పక్కన ఉన్న విశ్రాంతి షెడ్డులో కూడా వ్రతాలు నిర్వహించనున్నామని చెప్పారు.

ముఖ్య నిర్ణయాలివీ..

- కార్తిక మాసంలో శని, ఆది, సోమవారాలతో పాటు దశమి, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో సత్యదేవుని వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనాలను అర్ధరాత్రి ఒంటిగంటకే ప్రారంభిస్తారు.
- శని, ఆది, సోమవారాల్లో 50 వేల మందికి పైగా, ఇతర పర్వదినాల్లో లక్ష మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేయాలి.
- పశ్చిమ రాజగోపురం ఎదుట నిర్మించనున్న విశ్రాంతి షెడ్డులో రూ.300 దర్శనం టికెట్లు తీసుకున్న వారిని వారి స్లాట్ సమయంలో మాత్రమే స్వామివారి దర్శనానికి అనుమతించాలి. స్లాట్ సమయం వచ్చే వరకూ వారు ఆ విశ్రాంతి షెడ్డులోనే ఉండాలి. తొక్కిసలాట జరగకుండా ఈ చర్య తీసుకోవాలి.
- 24వ తేదీన క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పంపా జలాశయంలో సత్యదేవుని తెప్పోత్సవం ఘనంగా నిర్వహించాలి. తెప్ప తిరిగేందుకు వీలుగా పంపా జలాశయంలో నీటిమట్టం 98 అడుగులు ఉండాలి. ప్రస్తుతం 91 అడుగుల నీటిమట్టం ఉంది. ఏలేరు రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. కనీసం 100 క్యూసెక్కులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరాలి.
- 27న కార్తిక పౌర్ణమి సందర్భంగా సత్యదేవుని గిరిప్రదక్షిణ ఘనంగా నిర్వహించాలి. దీంతో పాటు సత్యదీక్షల విరమణ సందర్భంగా డిసెంబర్ 4న కూడా గిరి ప్రదక్షిణ నిర్వహించాలి.
- రత్నగిరిపై పాత సీఆర్‌ఓ కార్యాలయం వద్ద, సత్యగిరిపై హరిహరసదన్ వద్ద, దేవస్థానం కళాశాల మైదానంలో కేశఖండన శాలలు ఏర్పాటు చేయాలి. భక్తులు అక్కడే మొక్కు చెల్లించి స్నానం చేసి, స్వామి వారి దర్శనానికి వెళ్లేలా ఏర్పాటు చేయాలి.
- కార్తిక మాసంలో రత్నగిరి పైకి బస్సులను అనుమతించరు. చిన్న కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను సత్యగిరి, రత్నగిరి జంక్షన్‌లోని పార్కింగ్ స్థలంలో నిలిపివేస్తారు. అక్కడి నుంచి నడిచి స్వామివారి ఆలయానికి రావాలి. వృద్ధులు, వికలాంగుల కోసం బ్యాటరీ కార్లు, వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలి.
- భక్తుల వాహనాలను ఆదిశంకర మార్గ్ ద్వారా దిగువకు వెళ్లే ఏర్పాటు చేస్తారు. వీఐపీలు, ఇతరుల వాహనాలను మాత్రం ప్రకాష్ సదన్ సత్రం పక్కన ఉన్న ర్యాంపు ద్వారా పేపర్ మిల్లు పార్క్ వరకూ అనుమతిస్తారు. అక్కడి నుంచి సబ్ క్యాంటీన్ వెనుక నిర్మిస్తున్న రోడ్డు ద్వారా రెండో ఘాట్ రోడ్డుకు వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేస్తారు.
- తెప్పోత్సవం నాడు అగ్నిమాపక యంత్రంతో సిబ్బంది సిద్ధంగా ఉండాలి.
- కొండ దిగువన, సత్యగిరి, రత్నగిరిపై మూడుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు దేవస్థానం, ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి.
- అన్నవరం రైల్వే స్టేషన్ నుంచి రత్నగిరికి బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారుల అంగీకారం.
- రైల్వే స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డుకు, మెయిన్ రోడ్డు రెండు ఆర్చిల వరకూ విద్యుద్దీపాలు నిరంతరాయంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.
- అన్నవరం గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు పంచాయతీకి దేవస్థానం నుంచి అవసరమైన సహకారం అందించాలి.
- కార్తిక మాస ఏర్పాట్లపై ఈ నెల 10న ట్రయల్ రన్ నిర్వహించాలి.
- ఈ సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, వేద పండితుడు గొల్లపల్లి ఘనాపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, శంఖవరం, తొండంగి తహసీల్దార్లు సుబ్రహ్మణ్యం, బాలసుబ్రహ్మణ్యం, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, అన్నవరం సర్పంచ్ కుమార్‌రాజా, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కార్యాలయానికి ఉత్తమ అవార్డు


అవార్డుతో కమిషనర్-1 మనోజ్‌కుమార్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయానికి 2023 సంవత్సరానికి గాను బెస్ట్ రీజినల్ ఆఫీస్ (స్మాల్) లభించిందని ఈపీఎఫ్ కమిషనర్-1 మనోజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఈపీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయాలకు వివిధ కేటగిరీల కింద ఈపీఎఫ్ సంస్థ అవార్డులు ప్రకటించిందన్నారు. దీనిలో దేశంలోని 84 చిన్న ప్రాంతీయ కార్యాలయాలకు సంబంధించి తమకు బెస్ట్ రీజినల్ ఆఫీస్ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ నెల 2న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ మంత్రి రామేశ్వర్ తేలి నుంచి ఈ అవార్డు అందుకున్నామని మనోజ్‌కుమార్ చెప్పారు. అవార్డు సాధించిన సిబ్బందిని, అధికారులను ఆయన అభినందించారు. కార్యాలయంలో ఉత్తమ పద్ధతులకు ఈ అవార్డు లభించిందన్నారు. కార్యాలయానికి వచ్చే వారి సమస్యలను పరిష్కరించేందుకు స్మైలీ వారియర్లతో కూడిన స్మైలీ జోన్‌ను ఫ్రంట్ ఆఫీసులో ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా మహిళా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. 99 శాతం క్లెయిములను మూడు రోజుల్లోపు, 100 శాతం క్లెయిములను 10 రోజుల్లోపు పరిష్కరించామని వివరించారు. పరిసరాల్లోని మహిళల సౌకర్యార్థం క్రెచ్ సౌకర్యం కల్పించామన్నారు. పరిశుభ్రత, సంబంధిత పద్ధతులపై రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నుంచి స్వచ్ఛత అవార్డు-2021 అందుకున్నామని మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్లు వైడీ శ్రీనివాసరావు, ఎం.రామారావు, లోక్‌నాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఒడికి దూరమై.. తుప్పల పాలై..


తుప్పల్లో లభ్యమైన పసికందు

ఉప్పలగుప్తం: అమ్మపొత్తిళ్లెన్నడు ఎరుగని ఆ పసికందు.. పుట్టిన కొద్ది గంటల్లోనే తల్లి ఒడికి దూరమైంది.. విషక్రిములు సంచరించే తుప్పల పాలైంది. మనసును కలచివేసే ఈ సంఘటన మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామ పంచాయితీ పరిధి నల్లవారిపేటలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు, వైద్యుల కథనం ప్రకారం.. నల్లవారిపేట బహిర్భూమిలో ఉదయం పసికందు ఏడుపు వినిపించింది.

అటుగా వెళ్తున్న స్థానికులు అక్కడకు వెళ్లి చూడగా తుప్పల్లో చిన్న పసికందు కనిపించింది. దీంతో వారు స్థానిక ఏఎన్ఎంకు సమాచారం అందించారు. విషయం తెలియడంతో వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆ ఆడ శిశువు జన్మించి ఒక రోజు అయ్యిందని గుర్తించి ఎస్.యానాం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. కోమలమైన లేత పూల రేకులా ఉన్న ఆ చిన్నారి శరీరంపై స్వల్పంగా గాయాలయ్యాయి.

ఆ చిన్నారికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఆ పసికందును కాకినాడలోని శిశు సంక్షేమ కేంద్రానికి తరలిస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి తెలిపారు. ఈ ఘటనపై సీఐ పి.వీరబాబు నేతృత్వంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

బ్రహ్మోత్సవం.. నయనమనోహరం


స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


హంస వాహనంపై స్వామి వారి ఊరేగింపు

- సరస్వతీ అలంకరణతో హంస వాహన సేవ
- ఘనంగా మహాలక్ష్మి హోమం, లక్ష కుంకుమార్చన

ఆత్రేయపురం: పావన గౌతమీ గోదావరి తీరాన ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు నయనమనోహరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామివారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. భక్తిపారవశ్యంతో బ్రహ్మోత్సవాలను తిలకించి, పులకించారు. ఉత్సవాల రెండో రోజైన శుక్రవారం.. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో.. ఉభయ దేవేరులతో అలంకృతుడైన స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, ప్రధాన హోమాలు, గోదావరి నదీ జల సంగ్రహణ, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, సాయంత్రం స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, మహాలక్ష్మి హోమం, దిగ్దేవతా బలిహరణ తదితర క్రతువులు జరిగాయి. సరస్వతీ అలంకరణలో స్వామివారికి హంస వాహన సేవ నిర్వహించారు. విద్యకు మూలాధారం సరస్వతీదేవి. ఆ తల్లి అధిష్ఠానమైన పరబ్రహ్మ.. హంసను అధిరోహిస్తారు. పాలు, నీళ్లు కలిపి పెడితే హంస పాలను స్వీకరించి, నీళ్లను విడిచిపెడుతుందని చెబుతారు. జీవితంలో భక్తి మార్గం ద్వారా మంచిని అలవర్చుకుని చెడును విడిచిపెట్టాలని చెప్పడమే హంస వాహన పరమార్థం. బ్రహ్మోత్సవాల వైదిక క్రతువులను ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు.

స్వామి వారికి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు, మహాపుష్పయాగం, సహస్ర దీపాలంకరణ సేవ. సాయంత్రం కోదండరామ అలంకరణతో హనుమద్వాహన సేవ.


గౌతమీ గోదావరి జలాలతో ఆలయ ప్రదక్షిణ

ఆబోతు అదృశ్యంపై గ్రామస్తుల ఫిర్యాదు

మలికిపురం: ఆబోతు అదృశ్యంపై కేశనపల్లి గ్రామస్తులు శుక్రవారం మలికిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి, అచ్చు వేసి వదిలిపెట్టిన ఆబోతు స్థానికుల పూజలు అందుకుని, పెట్టిన ఆహారం తింటూ తిరుగుతోందన్నారు. ఇటీవల ఆ ఆబోతు జాడ లేకపోవడంతో విచారణ చేయగా, అనపర్తికి చెందిన గంగిరెద్దుల శ్రీను దొంగతనంగా తోలుకు వెళ్లినట్టు తెలిసిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడితో ఫోనులో మాట్లాడగా, తానే ఆ ఆబోతును తీసుకుని వెళ్లానని, రాజమహేంద్రవరంలో వదిలేశానని చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశాడని కేశనపల్లి వాసులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఆబోతును గంగిరెద్దుల శ్రీను కబేళాకు అమ్మేసినట్టు అనుమానిస్తున్నామని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి, తమ ఆబోతును తిరిగి ఇప్పించాలని వారు కోరారు. ఫిర్యాదుపై సంతకాలు చేసిన వారిలో కేశనపల్లికి చెందిన అడబాల ఏసుబాబు, ఆంజనేయులు, ఏబీ నాయుడు, ఏవీ సుబ్బారావు, ఎ.రాజశ్రీ ఉన్నారు.



వలలో అల రొయ్యలు

సముద్రంలో అరుదుగా దొరికే 'అల రొయ్యలు' శుక్రవారం మత్స్యకారుల వలలకు చిక్కాయి. వీటిని ఎక్కువగా ఎగుమతి చేస్తారని వారు చెప్పారు. పరిమాణాన్ని బట్టి కేజీ రొయ్యలను సుమారు రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ కొనుగోలు చేస్తారని తెలిపారు.

– కొత్తపల్లి

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ RJY కొవ్వూరులో రుడా అప్రూవ్డ్ లే అవుట్ నందు గజం రూ.12,500/- మాత్రమే. ప్రతి బుకింగ్‌పై 3 గ్రా. అగ్రిమెంట్‌పై 10 గ్రా గోల్డ్ కాయిన్ ఫ్రీ. + ప్లాచ్ కార్డు + 1 లక్ష కూపన్. బ్యాంక్ లోన్ కలదు. 99853 52579 [R-4669]

Services

■ వ్యవసాయ భూములకు, రైతులకు, ఇండస్ట్రీలకు, వ్యాపారస్తులకు, పర్సనల్స్‌కు, తక్కువ వడ్డీకి సహాయం చేయబడును. సంప్రదించండి. Ph: 7997441253 [H-788203]

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6278]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 6309563491 [H-193277]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9281159721, 8919551629 [H-788343]

Wanted

■ డెలివరీ ఆటోపై పనిచేయుటకు బాయ్స్ కావలెను. 7వ తరగతి ఆపైన అర్హత గలవారు సంప్రదించండి : శ్రీ గాయత్రి ఏజన్సీస్, కాకినాడ. ✆ : 94403 52688. [R-132]

■ రాజమండ్రి, దానవాయిపేట ప్రముఖ డయాబెటిస్ హాస్పిటల్‌లో అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. ✆ : 94403 39455 [R-136]

■ హైదరాబాద్‌లోని అప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F/ Caretakers కావలెను. 16-20 వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు కలవు. 6300813664 [G-1182]

■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12,000+ట్రావెల్ అలవెన్సు+ఇన్సెంటివ్స్, అర్హత: డిగ్రీ, వయస్సు: 20-32, ఫోన్ నెంబర్: 9381848549 [G-1188]

■ కాకినాడ రోహన్ డిజిటల్స్ ఫ్లెక్స్ షాపులో పనిచేయుటకు ఫోటోషాప్ డిజైనర్స్ కావలెను. రూమ్ సదుపాయం కలదు. జీతం: 15,000/- నుంచి 20,000/- వరకు. ✆ : 98482 14444 [R-1889]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 8074612837. [T-764166]

■ Urgent Requirement Collection Executives in HDB Finance, Rajahmundry Locations, Contact Cell: 8801124686, 9121911367. [T-764167]

■ తిరుపతిలో ప్రముఖ సేవా సంస్థ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, హౌస్ కీపింగ్ వంట మనిషి, వాచ్‌మెన్ భార్యాభర్తలకి ఉచి వసతి సౌకర్యం కల్పించబడును.✆ 9848678360. [T-4707]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640468899, 9640258899 [HA-813]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీతం: 15000 - 40000/-, ఫ్రీ రూమ్+భోజనం. HYD, Ph: 7995984445 [HA-809]

■ MS కంపెనీ నందు టెలికాలర్స్ గా పనిచేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ఫీమేల్ వెంటనే కావలెను. అర్హత: 10th, జీతం: 16,000 నుండి 18,000 వరకు. ఫోన్ : 7416297427, 7032253968 [HA-783]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. AP & TS అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52828, 6281208656 [B-1206467]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్తమ ప్రతిభకు ఉజ్వల జీవితం
GV మాల్‌లో ఉద్యోగ అవకాశాలు!
ఆకర్షణీయమైన జీతాలు
టెక్స్‌టైల్స్ రంగంలో ఒక ల్యాండ్‌మార్క్ ... మూడు రాష్ట్రాలలో విస్తరిస్తున్న
GV మాల్ త్వరలో మన అమలాపురంలో...
డీలక్స్ థియేటర్ రోడ్, హెడ్ పోస్టాఫీస్ వెనుక, గడియారం స్తంభం సెంటర్, అమలాపురం.
శారీస్, లేడీస్‌వేర్, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్ మరియు అడ్మిన్ సెక్షన్‌లో పనిచేయుటకు కావలెను
- ఫ్లోర్ సూపర్‌వైజర్స్ (6 సం॥ అనుభవం కలిగినవారు)
- హెల్పర్స్
- సేల్స్‌మెన్స్/సేల్స్ గర్ల్స్
- రిసీవింగ్ గర్ల్స్
- క్యాషియర్స్
- టైలర్స్
- వాలెట్ పార్కింగ్ డ్రైవర్స్
- ఎలక్ట్రీషియన్స్

ఆసక్తి కలిగిన అభ్యర్థులు (రెస్యూమ్, 2 లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫోటోలు ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ తప్పనిసరి) నేరుగా ఇంటర్వ్యూకి హాజరు కావలెను
ఇంటర్వ్యూ తేది: 05-11-2023 ఆదివారం ఉదయం 10:00 గం. నుండి
ఇంటర్వ్యూ వేదిక: డీలక్స్ థియేటర్ రోడ్, హెడ్ పోస్టాఫీస్ వెనుక, గడియారం స్తంభం సెంటర్, అమలాపురం.
సంప్రదించవలసిన ఫోన్: 8639773514
TELANGANA ANDHRA PRADESH KARNATAKA
GV MALL® shop & celebrate